గండి పూడ్చరు.. తిప్పలు తప్పవు..

- బుడమేరు మధ్యకట్టలో ప్రమాదకరంగా రాకపోకలు
- ఆరు నెలలు గడిచినా కనీస చర్యలు సున్నా


బుడమేరు గండి పడిన ప్రాంతంలో కొట్టుకు పోయిన రోడ్డు


ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న ద్విచక్రవాహన చోదకుడు


బుడమేరు గండిపడిన ప్రాంతంలో రోడ్డు దుస్థితి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరుకు గండిపడి ఆరు నెలలు కావస్తున్నా పట్టించుకునేనాథుడే లేడు. విజయదుర్గానగర్, కేఎల్‌రావు నగర్, బుడమేరు మధ్యకట్ట వాసులకు బుడమేరు వరద కష్టాలు నేటికీ తొలగలేదు. ఈ ప్రాంతంలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఈ దారి వద్ద బుడమేరు మధ్యకట్టలో వరదల సమయంలో ఏలూరు కాల్వ మధ్య గండి పడింది. ఇది జరిగి ఆరు నెలలు కావస్తున్నా మరమ్మతులు చేయలేదు. రోడ్డు నిర్మాణ పనులు జరగలేదు. నాడు సీఎం చంద్రబాబు బుడమేరు ప్రక్షాళన చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా కనీస మర్మతులు జరగకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయదుర్గానగర్ నుంచి బుడమేరు వంతెన వద్దకు చేరుకోవాలంటే చుట్టూతిరిగి దేవీనగర్ మీదుగా గానీ మధురానగర్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

మట్టిదిబ్బల మీదుగా..

గండిపడిన ప్రాంతంలో ఒకవైపు కేవలం కొద్దిపాటి మట్టిని పోసి వదలివేశారు. కనీస మరమ్మతులు చేయకపోవడంతో మట్టిదిబ్బలుగా మారాయి. చుట్టూతిరిగి వెళ్లలేని పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు మట్టి పోసిన ప్రాంతం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పలువురు జారి ప్రమాదాల బారిన పడుతున్నారు.

తాగునీటికీ అవస్థలే

బుడమేరు మధ్యకట్టలో గండిపడటంతో తాగునీటి పైపులైన్లు పాడయ్యాయి. దీంతో తరచూ తాగునీటి సమస్యలు వస్తున్నాయి. ఇక్కడ మరమ్మతులు పూర్తైతే తాగునీటి సమస్యలు తీరుతాయని స్థానికులు ఎదురు చూస్తున్నారు. వేసవి దృష్ట్యా అధికారులు స్పందించి ఇక్కడ రోడ్డును సరిచేయటంతో పాటు తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

మీదంటే.. మీదే

ఇక్కడ గండి పడిన ప్రాంతాన్ని సరిచేసి రాకపోకలు సాగించాలంటూ స్థానికులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు నగరపాలకసంస్థ వారు చేయాలని.. వీఎంసీ వారు ఇరిగేషన్ అధికారులు చేయాలని ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోవటంతో రాకపోకలకు తిప్పలు తప్పటం లేదు.

ఆరు నెలలు గడుస్తున్నా..



ఆరు నెలలు గడుస్తున్నాయి.. కనీసం రోడ్డును సరిచేసి రాకపోకలు పునురుద్ధరించ లేదు. పేదలపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏ పాటిదో ఇక్కడ రోడ్డును చూస్తే అర్థం అవుతుంది. ఇప్పటికే ఇక్కడ నిరసన ధర్నా నిర్వహించి సంతకాలు సేకరించి కలెక్టర్‌కు అందజేశాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి పోరాటం చేయడానికి సిద్ధం ఉన్నాం.

–గంగాడ వెంకటేశ్వరరావు, సీపీఎం డివిజన్ సెక్రటరీ

చుట్టూ తిరిగి వెళ్లాలి



అత్యంత సమీపంలో ఉండే బుడమేరు వంతెనకు వెళ్లాలంటే మధురానగర్ వంతెనగానీ దేవీనగర్ మీదుగా గానీ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఈ రోడ్డుపై బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు.తాగునీటి పైపులైన్‌లు పాడవ్వటంతో తరచూ తాగునీటి సమస్యలు సైతం వస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పుట్లయ్య బుడమేరు మధ్యకట్ట, చిరు వ్యాపారి

క్లుప్తంగా

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు

కమిషనర్ ధ్యానచంద్ర



భవానీపురం(విజయవాడ పశ్చిమ): నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకంపై కఠినమైన చర్యలు తీసుకోవడంతోపాటు పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కార్పొరేషన్‌లోని ఆయా విభాగాధిపతులు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రజారోగ్య సిబ్బందితో గురువారం సాయంత్రం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్లు తమతమ డివిజన్ల పరిధిలో విస్తృతంగా పర్యటించి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయించే వారితోపాటు కొనుగోలు చేసే వారిపై కూడా చట్టపరమైన శిక్షలు విధించాలని సూచించారు. కార్యక్రమాన్ని విభాగాధిపతులంతా పర్యవేక్షించి ప్లాస్టిక్ నిషేధంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు, విక్రయదారులకు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం కల్పించినప్పటికీ, ఇంకా ప్లాస్టిక్ వినియోగం కనబడుతూనే ఉండటం సరికాదన్నారు. పర్యావరణ హితమైన వస్తువులనే వాడాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

నూతన టెక్నాలజీతో వేగంగా ఔషధ పరిశోధనలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): అభివృద్ధి చెందిన దేశాల్లో ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి నూతన ఔషధ పరిశోధనలు వేగవంతంగా పూర్తిచేస్తున్నట్లు అమెరికాలో క్యాన్సర్‌పై పరిశోధనలు చేస్తూ బిజినెస్ డెవలప్‌మెంట్ లీడర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ సబ్బినేని హారిక అన్నారు. నగరంలోని కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మా అన్వేషణ్–2025 పేరుతో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి హారిక మాట్లాడుతూ నూతన టెక్నాలజీని పరిశోధనలో ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో సమర్థంగా నిర్వహించవచ్చన్నారు. ఏఐ టెక్నాలజీపై అవగాహన కలిగిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిశోధనల్లో ఏఐని ఉపయోగించి త్వరితగతిన పూర్తి చేస్తున్న క్రమాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సునీత, డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఈ నెల 8వ తేదీ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వావిలాల రజనీకాంత్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహించే శిబిరంలో ఆయాన్ ఐ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా నేత్ర పరీక్షలు చేస్తారని తెలిపారు. శుక్లాలు ఉన్నవారికి అవసరమైన మేరకు రాయితీపై శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'మహిళలు-చైతన్యం' సదస్సు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో 'మహిళలు–చైతన్యం'పై సదస్సు నిర్వహించనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో సిద్ధార్థ దుర్గామల్లేశ్వర మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ పాల్గొంటారని పేర్కొన్నారు.

రూ. లక్ష విలువైన మూడు వెండి కిరీటాలు వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ దేవాలయంలో గురువారం సినీ నటి సురేఖవాణి కుటుంబ సభ్యులతో కలిసి రూ. లక్ష విలువ చేసే మూడు వెండి కిరీటాలను ఆలయానికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ఆలయంలోని సాయిబాబా, అయ్యప్పస్వామి, వేంకటేశ్వర స్వామికి వెండి కిరీటం తయారు చేయించి అందజేస్తున్నట్లు తెలిపారు. భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ శరణ్‌స్వామి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి కిరీటాలు అలంకరించారు అనంతరం 300 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఎలక్ట్రానిక్స్'తో యువతకు ఉపాధి


రవీంద్రను సత్కరిస్తున్న సిద్ధార్థ ప్రిన్సిపాల్ రమేష్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి సాంబశివరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిత్య జీవితంలో ఎలక్ట్రానిక్స్ పరికరాల వినియోగం భవిష్యత్‌లో మరింత ఎక్కువగా ఉంటుందని మైటిజన్ కంపెనీ డైరెక్టర్ పి.రవీంద్ర చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యాన ఎలక్ట్రానిక్స్ వెహికల్స్ అనే అంశంపై కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో జరుగుతున్న రెండు రోజుల వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, ఏసీ, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వాహనాలు ఇలా ఎన్నో ఎలక్ట్రానిక్ పరికరాలను మనం నిత్య జీవితంలో విరివిగా ఉపయోగిస్తున్నామని చెప్పారు. ఇంట్లో వాడే ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాలను సులభంగా మరిన్ని ఎక్కువ ఫీచర్స్‌తో తయారు చేసి కంపెనీలు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయని చెప్పారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మరింత మెరుగైన ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఎలక్ట్రానిక్స్ వాహనాల పనితీరుతో పాటుగా వాటిలో ప్రధానమైన బ్యాటరీల్లో జరిగే క్రియలను తెలియజేశారు. బ్యాటరీలను తయారు చేసే విధానాలపై వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కేవీస్వీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో పుస్తకాల్లో చదివిన పాఠాల కంటే ఇలాంటి వర్క్‌షాప్‌లతో ఎంతో అవగాహన పెరుగుతుందన్నారు. సదస్సు అనంతరం రవీంద్ర విద్యార్థుల సందేహాలను తీర్చారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్. అధ్యాపకులు, విద్యార్థులు రవీంద్రను సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, సేఫ్, తరుణి తరంగాలు, భారత మహిళామండలి, జనశిక్షణ సంస్థాన్, స్పృహాస్తి, సమన్విత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు, అభ్యుదయ గీతాలు, కవితల పోటీలు జరిగాయి. ముఖ్య అతిథి ఆంజనేయులు పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాల ఉత్పత్తుల అమ్మకం ద్వారా పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు స్త్రీల ద్వారానే జరుగుతున్నాయన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఈ స్థాయిలో ఉండటంలో మహిళలదే కీలక పాత్ర అన్నారు. యూఎస్ఏ హెల్త్ కేర్ ఎకనమిస్ట్ పాలపర్తి ఇంద్రాణి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తారని, యోగా, మెడిటేషన్‌లకు తప్పనిసరిగా సమయం కేటాయించాలన్నారు. ఎం.బి.విజ్ఞానకేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి మాట్లాడుతూ లింగ సమానత్వం సాధించాలంటే ఐక్యరాజ్య సమితి ఇచ్చిన పిలుపును వేగవంతం చేయాలని, బాలికలు, మహిళలను విద్యా, ఆరోగ్య, ఉపాధి, ఉద్యోగాల్లో పరిపాలనాధికారాల్లో, క్రీడా రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు, పి.విజయ, పావని, గీత, నందిని, సేఫ్ బాధ్యులు ఉషారాజా, శేషు, తరుణీతరంగాలు బాధ్యులు శ్రీదేవి, జనశిక్షణ సంస్థాన్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు పటిష్ట చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరం పరిశుభ్రంగా ఉండేందుకు చేపడుతున్న పారిశుద్ధ్య నిర్వహణకు పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో పాటు ఎటువంటి లోపం ఉండకూడదని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని సమావేశ మందిరంలో గురువారం ఆయన లీడ్ వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోడర్ పాయింట్ల వద్ద ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్ ఆంధ్రప్రదేశ్ కానిస్టెంట్ మానిటరింగ్ ఆఫ్ మున్సిపల్ సర్వీసెస్(ఏపీ సీఎంఎంఎస్)లో ప్రతి రోజూ అప్‌డేట్ చేయాలని చెప్పారు. ఈ యాప్‌లో పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం వచ్చే కార్మికుల హాజరు, ఇంటి వద్దనే వ్యర్థాల సేకరణ, ఒక్కో శానిటరీ సెక్రటరీకి ఎన్ని ఇళ్లు ఉన్నాయి, ఆయా ఇళ్ల నుంచి నిత్యం చెత్త సేకరణ జరుగుతుందా లేదా అన్న విషయాలను పొందుపరచాలని వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపీ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు కె.శివరామ్ ప్రసాద్, ఆర్.ఓబేశ్వరరావు, సలీం అహ్మద్, డి.సోమరాజు, ఎం.రమేష్ బాబు పాల్గొన్నారు.

తప్పకుండా హెల్మెట్ ధరించాలి

ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి


సదస్సులో పోలీసు అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ డీసీపీ ఎం. కృష్ణమూర్తి నాయుడు సూచించారు. గురువారం సూర్యారావుపేటలోని శ్రీధర్ సీసీఈలో రోడ్డు ప్రమాదాల నివారణకు 'రహదారి భద్రతపై' ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సృష్టిలోని అన్ని జీవులకు ప్రాణం ఎంతో విలువైందన్నారు. ప్రాణాన్ని కాపాడుకునేందుకు వాహనచోదకులు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ ఎస్.ఆర్. వంశీధర్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల ప్రధాన కారణం ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడమేనన్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడటం ప్రమాదకరమన్నారు. అనంతరం అతిథులను శ్రీధర్ సీసీఈ డైరెక్టర్ కొమ్మూరి శ్రీధర్ సత్కరించించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వి. జానకిరామయ్య, సీసీఈ డైరెక్టర్ సీతారామిరెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌లకు గౌరవ వేతనం వెంటనే పెంచాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాజ సేవలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశ వర్కర్లకు గౌరవ వేతనం వెంటనే పెంచాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక చిరు ఉద్యోగులు కనీస వేతనం కూడా అందుకోలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఆశ వర్కర్ల జీతం 3 వేల నుంచి 10 వేలకు పెంచుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వారిని నడి రోడ్డుకు లాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ విపత్కర సమయంలో ఆశ వర్కర్ల చేసిన సేవలు వెలకట్టలేనివని.. అయినా వారి సేవలను కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. గర్భిణులు, చిన్నారులు, ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆశ వర్కర్లు నేటికీ గౌరవ వేతనంతోనే పని చేస్తున్నారని.. కనీస వేతన చట్టం ప్రకారం వారికి సరైన జీతాలు అందాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. వీరిపై కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదని.. కనుక ప్రభుత్వం ఆశా వర్కర్ల గౌరవ వేతనం పెంచుతూ తక్షణమే ప్రకటన చేయాలని కోరారు. ఆశ వర్కర్ల 10 ప్రధాన డిమాండ్లను గత ప్రభుత్వం ఆమోదించిందని.. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలైనా ఆ దిశగా కనీసం దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే గత ప్రభుత్వం ఆమోదించిన 10 డిమాండ్‌లకు వెంటనే జీఓ ఇవ్వాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పాదిలి పద్మ(45) గురువారం మరణించినట్లు నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురానికి చెందిన పాదిలి పద్మ ఈ నెల 4న కండ్రిక రోడ్డు నుంచి రాజీవ్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. గీతాంజలి స్కూల్ వద్ద కుక్క అడ్డు వచ్చి పడిపోయింది. తలకు గాయమైన పద్మను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. బుధవారం ఆపరేషన్ చేయగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతురాలి కుమారుడు పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

మాచవరం పీఎస్ పరిధిలో '50' ఏర్పాటు


మాచవరం పోలీస్‌స్టేషన్


స్టేషన్‌లో సీసీ కెమెరాల ఫుటేజ

గుణదల(విజయవాడ తూర్పు): సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరస్తులకు చెక్ పెట్టడానికి పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో మాచవరం పీఎస్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో, ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నేరాలను నియంత్రించవచ్చని పోలీసులు అంటున్నారు.

ఇప్పటి వరకు ..ఇక పై..

ఆయా ప్రాంతాల్లో జరిగే దొంగతనాలు, దొమ్మీలు, వేధింపులు, అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలను నివారించడానికి పోలీసులు ఘటనా స్థలాలకు వెళ్లి సమాచారం సేకరించవలసి వచ్చేది. వాటికి సంబంధించిన వివరాలు దొరికేవి కావు. దీంతో దర్యాప్తు ఎక్కువ సమయం పట్టి కేసుల పరిష్కారం ఆలస్యమయ్యేది. సీసీ కెమెరాల ఏర్పాటుతో పోలీసులకు నిఘా నేత్రం మరింత చేరువైంది. సీసీ ఫుటేజీలతో నేరస్తులను, సంబంధిత వివరాలను సేకరించడానికి సులువైన మార్గం ఏర్పడింది. ఇకపై దొంగ తనాలు, ఈవ్‌టీజింగ్, రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలను సులువుగా ఛేదించి నివారించే అవకాశం ఉంది.

స్టేషన్ పరిధిలో..

నగరంలోని పోలీస్‌స్టేషన్‌ల్లో మాచవరం పీఎస్‌కు ప్రాధాన్యముంది. గతంలో ఈ స్టేషన్ పరిధిలో అనేక పెద్ద చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్లు అధికంగా జరిగేవి. పోలీసుల చర్యలకు తోడు సీసీ కెమెరాల ఏర్పాటుతో కేసుల పరిష్కారం మరింత సులభతరం కానుంది. ఇప్పటికే పీఎస్ పరిధిలోని గుణదల, క్రీస్తురాజపురం, మొగల్రాజపురం, లబ్బీపేట, మాచవరం, చుట్టుగుంట తదితర ప్రాంతాల్లో సుమారు 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్లతో పాటు నిర్మానుష్య ప్రాంతాల్లో సైతం నిఘా నేత్రాలను ఏర్పాటు చేసింది. నేరస్తుల కదలికలు, రౌడీ మూకల ఆగడాలకు ఇక చెక్ పెట్టనున్నారు.

నగర బహిష్కరణలో ఉన్న వ్యక్తి అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): నగర బహిష్కరణలో వున్న పుట్ట దుర్గారావు అలియాస్ కరేబియా గురువారం వాంబే కాలనీలో సంచరిస్తుండగా గస్తీ తిరుగుతున్న ఎస్ఐ పండు దొర అరెస్ట్ చేశారు. వాంబే కాలనీ ప్లాట్ నంబరు 206, జి.బ్లాక్‌కు చెందిన దుర్గారావు రౌడీషీటర్‌గా గత సెప్టెంబరు 20వ తేదీ నుంచి నగర బహిష్కరణలో ఉన్నాడు. రూల్స్‌ను అతిక్రమించి నగరంలో సంచరిస్తున్నందుకు అతన్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

అక్రమ రవాణా బాధిత మహిళలకు న్యాయం చేయండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అక్రమ రవాణా బాధిత మహిలకు తక్షణ న్యాయం చేయాలని విముక్తి మానవ అక్రమ రవాణా, వ్యాపార లైంగిక దోపిడి బాధితుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విముక్తి ఆధ్వర్యంలో అక్రమ రవాణా బాధితుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు అపూర్వ మాట్లాడుతూ దేశంలో అక్రమ రవాణా బాధిత మహిళలు, సెక్స్ వర్కర్లు ఇంకా ఎక్కువ అడ్డంకులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ, ఏపీ మహిళ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాంబ, విముక్తి రాష్ట్ర కోశాధికారి లక్ష్మి మాట్లాడుతూ బాధిత మహిళల హక్కులు కాపాడాలన్నారు. బాధితుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

మైనర్ అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న వికాస్ కాలేజీలో బీటెక్ విద్యార్థిని (17) తప్పిపోయినట్లు వచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. చాట్రాయి మండలంలోని సోమవరానికి చెందిన విద్యార్థిని నున్న వికాస్ కాలేజీలో బీటెక్ మొదటి ఏడాది చదువుతోంది. ఆమె ఈ నెల 1వ తేదీన సోమవరం గ్రామం వెళ్లింది. 5వ తేదీన ఫీజు డబ్బు రూ.60వేలు తీసుకొని ఫ్రెండ్‌తో పాటు బస్సులో నున్న గ్రామం వచ్చింది. స్నేహితురాలు స్నాక్స్ కొనేందుకు బేకరి వద్దకు వెళ్లగా ఆమె ఆటోలో వెళ్లిపోయింది. ఆ స్నేహితురాలు అదృశ్యమైన విద్యార్థిని సోదరుడికి సమాచారమిచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు ఫోన్ చేయడానికి ప్రయత్నించినా స్పందించలేదు. కళాశాలలో సంప్రదించినా ఆమె కాలేజీకి వెళ్లలేదని తెలిసింది. దీంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసి.. సోమవరం గ్రామానికి చెందిన మల్లాటి రాంబాబు అనుమానం వ్యక్తం చేశారు.

స్థలం కబ్జా చేశారు

రామకృష్ణాపురంలో దివ్యాంగుడి ఆవేదన



మధురానగర్(విజయవాడ సెంట్రల్): రామకృష్ణాపురంలో స్థల వివాదమేర్పడింది. 280 గజాల స్థలాన్ని కబ్జా చేసి, తమ కుటుంబాన్ని రోడ్డున పడేశారంటూ దివ్యాంగ యువకుడు మస్తాన్ వలీ రామకృష్ణాపురంలో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తమ స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా తనను దివ్యాంగుడిని అని కూడా చూడకుండా బయటకి గెంటేశారని, తన వెంట వచ్చిన మీడియాను సైతం దూషిస్తూ కబ్జాదారులు రాళ్లదాడికి దిగారని వాపోయారు. అనేక సంవత్సరాల నుంచి తాము నివసిస్తున్న స్థలాన్ని మాది అని కొందరు ఆక్రమించుకున్నారని వాపోయారు. దీనిపై ప్రశ్నించిన తనపై, తల్లి, కుటుంబ సభ్యులపై దాడి చేశారని, న్యాయం కోసం తమ వెంట వచ్చిన మీడియా ప్రతినిధులపై రాళ్ల దాడికి దిగారని వాపోయారు. గత నెల 27న స్థలాన్ని ఆక్రమించి అక్కడ రౌడీలను ఉంచి ప్రశ్నించిన తమపై దాడి చేశారని, కళ్లల్లో కారం కొట్టి ఇబ్బంది పెట్టారన్నారు. ఇంటిలో ఉన్న సుమారు రూ. పది లక్షల విలువ చేసే సామగ్రిని రౌడీలతో బయటకు పడేశారని ఆరోపించారు. దాడిని పోలీసులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 రోజుల క్రితం తనకు ప్రమాదం జరిగిందని, కాలు తొలగించారని ఆ ప్రమాదానికి కారణం కూడా కబ్జాదారులే అన్న అనుమానం ఉందన్నారు. తమకు న్యాయం చేయాలని, స్థలాన్ని ఇప్పించాలని వేడుకున్నారు. ప్రభుత్వ పెద్దలు స్పందించాలని, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని 280 గజాల స్థలాన్ని తమకు ఇప్పించాలని కోరారు. ఆస్తికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు తన వద్దే ఉన్నాయని స్పష్టం చేశారు దాడి చేసిన వారి నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.